ప్రజాశక్తి

ఆదివారం 9 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్.లక్ష్మణరావు తదితరులు

ప్రజా సమస్యలే మా అజెండా

- పోరాడే శక్తులకు అండగా ఉంటా
- 10న నామినేషన్ జయప్రదం చేయండి
- ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారానికి పోరాడే శక్తులకు మండలి వేదికగా, బయటా పిడిఎఫ్ అండగా ఉంటుందని, ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు కోరారు. స్థానిక గీతా రీజెన్సీలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈనెల 10న నామినేషన్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో సభ, అనంతరం 12 గంటల నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పిడిఎఫ్ పోషిస్తున్న నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కొనసాగిస్తామని చెప్పారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి ▶ 2లో

ప్రజా సమస్యలే మా అజెండా

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 14 మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గెలుపొంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, ఇతర బాధిత వర్గాల సమస్యల పరిష్కారానికి అత్యంత నిజాయతీగా కృషి చేస్తున్నామని చెప్పారు. మండలి ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతోపాటు, బయట జరిగే పోరాటాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొంటూ మద్దతు ఇస్తున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ గుంటూరు ఛానల్, వరికెపుడిశెల, కౌలు రైతుల సమస్యలు, పట్టణాల్లో మౌలిక వసతులు వంటి అనేక అంశాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిథ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయని ఈ సందర్భంగా లక్ష్మణరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మండలిలో గొంతుకగా ఉంటానని, తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు రాజశేఖరరావు, ఎం కళాధర్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకుడు కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు డి లక్ష్మీనారాయణ, మేధావుల ఫోరం నాయకుడు అవధానుల హరి, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: పెద్ద దోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాలలో శనివారం రాత్రి ఫేర్వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వర్ సింగ్ భరద్వాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. చదువుతోనే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని ఉదాహరణ లతో వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మంతన్న, గాలె నాయక్, శ్రీనివాసులు, మౌలాలితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, అ ధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శ్మశాన స్థలం ఆక్రమణ

- ఆందోళనకు దిగిన సుందరయ్య కాలనీవాసులు
- జాతీయ రహదారిపై రాస్తారోకో

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని రెండో వార్డులో గల పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ వాసులు వినియోగించుకునే శ్మశాన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. విషయం తెలుసుకున్న సుందరయ్య కాలనీవాసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆక్రమణలు ఆగలేదు. కాలనీ వాసులంతా మూకుమ్మడిగా రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మార్కాపురం సిఐ సుబ్బారావు, పట్టణ ఎస్ఐలు సైదుబాబు, రాజమోహన్ ఇతర పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆక్రమిత స్థలాన్ని కాపాడితేనే ఆందోళన విరమిస్తామని భీష్మించారు. అంతలో అటుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా వచ్చారు. ఆయన వాహనం కూడా ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. ఎమ్మెల్యే కందుల ఆందోళనకారుల వద్దకు వచ్చారు. పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించేందుకు అధికారులను పంపిస్తామని హామీ ఇచ్చారు. శ్మశానాన్ని కాపాడతానని మాట ఇచ్చారు. ఆక్రమణదారులకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న తహశీల్దార్ చిరంజీవిని ఆదేశించారు.


రాస్తారోకో చేస్తున్న సుందరయ్య కాలనీ వాసులు

మాజీ సర్పంచి రాందాసుకు నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎం వేములపాడు టీడీపీ నాయకులు వలేటి తిరుపతిస్వామి తండ్రి, గ్రామ మాజీ సర్పంచ్ వలేటి రాందాసు(84) అనారోగ్యంతో శనివారం మరణించారు. ఆయన భౌతికాయాన్ని పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, చీమకుర్తి మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మండల ప్రధాన కార్యదర్శి తాటితోటి నరసింహారావు, చీమకుర్తి టౌన్ పార్టీ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, నాయకులు రావిపాటి రాంబాబు, మన్నం ప్రసాద్, రంగనాయకులు, తేళ్ల మనోజ్ కుమార్ తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

పలువురికి వైసిపి పదవులు

ప్రజాశక్తి-పొన్నలూరు

ప్రకాశం జిల్లా వైసిపి నిర్మాణ (సంస్థాగత) కార్యదర్శిగా మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, వైసిపి జిల్లా కార్యాచరణ కార్యదర్శిగా కాటా మాధవరావు, వైసిపి కొండపి నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులుగా పలనాటి వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. వారికి వైసిపి మండల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు తాము చిత్తశుద్ధితో తమవంతు కృషి చేస్తామని తెలియజేశారు. మాజీ మంత్రి, కొండపి వైసిపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా ఇంచార్జ్ కారుమూరి నాగేశ్వరరావు, వైసిపి ఒంగోలు పార్లమెంటు ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.

వైసిపి నేతలకు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన పార్టీ పదవులలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నేతలు పదవులు దక్కించుకున్నారు. వారిలో ప్రకాశం జిల్లా వైసీపీ వైస్ ప్రెసిడెంట్‌గా ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీగా కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివిటీ సభ్యులుగా సింగా ప్రసాద్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆ పదవులు పొందిన ముగ్గురిని శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసిపి నాయకులు పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీని మరింత అభివృద్ధి పరచాలని కోరారు. జరగనున్న ప్రతి ఎన్నికల్లో వైసిపి సత్తా చాటేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేపలమడుగు సర్పంచ్ తమ్మినేని సత్తిరెడ్డి, నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, రమణారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


వైసిపి నేతలను సన్మానిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న మస్తానయ్య

నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం

'దూదేకుల'ం కోసం నూర్‌బాషా కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, నూర్‌బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూదేకుల మస్తానయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కాపురంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మస్తానయ్య మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలో దూదేకుల నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు ఉందని గుర్తు చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుతో రాష్ట్రంలోని దూదేకుల కులస్తులకు అభివృద్ధిలో కొంత న్యాయం జరుగుతుందని అన్నారు. నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటులో సిఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో దూదేకులంతా ముస్లిం మైనార్టీలో అంతర్భాగమై ఉన్నారన్నారు. ఈ కారణంగా కొన్ని అవకాశాలకు దూరంగా ఉన్నామని చెప్పారు. దూదేకుల నూర్‌బాషా కులస్తుల మీద వివక్షతో వక్ఫ్‌బోర్డు, హజ్ కమిటీ, మైనార్టీ కమిషన్, మైనార్టీ కార్పొరేషన్, ఫైనాన్స్ వంటి ప్రాధాన్యత కలిగిన కమిటీలలో దూదేకుల నూర్‌బాషా కులస్తులకు అన్యాయం జరిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యత లేక చిన్న చూపు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 20 లక్షల జనాభాతో దూదేకులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నూర్‌బాషా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న సిఐ, ఎస్ఐ

యోగాసనాలతో ఆరోగ్యం: సిఐ

ప్రజాశక్తి-కొండపి

యోగాసనాల వేయడం వలన ఆరోగ్యంగా ఉంటామని కొండపి సిఐ జి సోమశేఖర్ తెలిపారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఉత్తర్వుల ప్రకారం, కనిగిరి ఎస్డిపిఓ సూచనల మేరకు కొండేపి సర్కిల్ పరిధిలోని కొండేపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల పోలీస్ సిబ్బందితో యోగా క్లాసులు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ సిబ్బంది కచ్చితంగా ఆరోగ్య నియమాలు పాటించాలని సిఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయాలని, కుటుంబ సభ్యులతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రేమ్ కుమార్, మూడు మండలాల స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ పి.పార్వతి హెచ్చరించారు. మండల పరిధిలోని నాయనపల్లి సర్వేనెంబర్ 75/3లోని భూములను ఆమె పరిశీలించారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ వివేకానంద కాలనీలో ప్రభుత్వ సొన పోరంబోకు భూమిని ఆక్రమించి లేఅవుట్ వేసేందుకు సిద్ధంకాగా గ్రామస్తులు తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహశీల్దార్ రికార్డులు పరిశీలించి, భూమి కొలతలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన భూమిలో అక్రమంగా ఎవరైనా ప్రవేశిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు సదరు స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు షేక్ రఫీ, కె.నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చీరాల

బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల (7) పరిధిలో 2024-2026 సంవత్సరాలకుగాను మద్యం దుకాణాలను గీత కులాల అభ్యర్థులకు కేటాయించేందుకు జరిగిన దరఖాస్తుల స్వీకరణ శనివారం సాయంత్రం 5 గంటలకు ముగిసిందని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి జి.దేవదత్తు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున 12 షాపులకు అప్లికేషన్లు వేసిన దరఖాస్తుదారులు ఈ నెల 10వ తేదీన బాపట్లలోని కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ వారి సమక్షమున లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించబడుతుందన్నారు. దరఖాస్తుదారులు అందరూ 10న ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఆఫీసులోని పిజిఆర్ఎస్ హాలు వద్దకు రావాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న కారు, వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

కారు మోటార్‌బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని కందుకూరు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రన్‌వే మీద శనివారం జరిగింది. గుంటూరుకు చెందిన కారు నెల్లూరు వైపునకు వెళుతుండగా మోటార్ బైక్ రన్‌వే మీద ఆకస్మికంగా తిరగడంతో కారు మోటర్ బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ బైక్ మీద వెళుతున్న జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన మిడసల మాల్యాద్రి(45) అక్కడికక్కడే మృతి చెందాడు. రన్‌వే మీద ఎలాంటి హెచ్చరిక లేకుండా తిరగటం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలాన్ని హైవే పోలీసులతోపాటు ఎస్ఐ బి.మహేంద్ర పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో కారుతో పాటు మోటార్ బైక్ కూడా పూర్తిగా దెబ్బతింది. రెండు వాహనాలను హైవే పోలీసులతో పాటు శింగరాయకొండ పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చౌడయ్య

హెల్మెట్ భారం కాదు.. భరోసా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 565 జాతీయ రహదారిపై మాచర్ల మార్కాపురం రోడ్డులో వచ్చి పోయే వాహనాలను ఆపి ఎస్ఐ పి.చౌడయ్య హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చౌడయ్య మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతి చెందిన, గాయాలైన సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నామని చెప్పారు. అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రాజెక్ట్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్‌పై రెండు రోజుల వర్క్‌షాపు విజయవంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ యస్.లక్ష్మణరావు సంయుక్తముగా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.జగదీష్ బాబు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీపై అనుబంధం పెంచుకోవటంవలన ఆధునిక పరిశ్రమలలో ఉత్తమముగా రాణించవచ్చని తెలిపారు. రెండు రోజుల వర్క్‌షాపును వి.శ్రీహరి, డీన్ రవీంద్రనాద్ చౌదరి, ప్రొఫెసర్ నిక్‌మార్ యూనివర్సిటి, హైదరాబాద్ ఆధ్వర్యములో నిర్వహించినట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టి. కిరణ్ కుమార్ తెలియజేశారు. ఈ వర్క్ షాపులో పాల్గొనటం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, ఆధునిక టెక్నాలజిలపై అవగాహన కలిగిఉండటం వలన ఉన్నత ఉద్యోగాలను సంపాదించటంలో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వి.శ్రీహరి, డీన్ రవీంద్రనాద్ చౌదరిలను సెక్రటరీ వనమా రామకృష్ణారావు సత్కరించారు.

మారుమూల ప్రాంతాలకు బిఎస్ఎన్ఎల్ సేవలు

- అందుబాటులోకి వచ్చిన 4జి సేవలు
- ఛానల్ పార్ట్‌నర్‌షిప్‌నకు ఆహ్వానం
- డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.అనంత కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విస్తృత సేవలు అందించే దిశగా భారత సంచార్ నిగం లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) కృషి చేస్తున్నట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.అనంత కుమార్ పేర్కొన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. విదేశీ ప్రైవేట్ టెక్నాలజీకి పోటీగా 'ఆత్మ నిర్భర్ భారతి పథకం'లో భాగంగా స్వదేశీ టెక్నాలజీని అభివృద్ధి పరిచేందుకు టెలికాం రంగం కృషి చేస్తుందన్నారు. ప్రైవేట్ రంగంలో వివిధ టెలికాం కంపెనీలు అందించలేని మారుమూల ప్రాంతాలకు సైతం బిఎస్ఎన్ఎల్ సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 4జి సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఫైబర్ కేబుల్ నెట్వర్క్ వ్యవస్థ ద్వారా ల్యాండ్ ఫోన్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో అంతరాయం కలగకుండా సేవలను విస్తృత పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులోకి 4జి టెక్నాలజీ..

కమ్యూనికేషన్ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పుల కనుగుణంగా 4జి సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు అనంత కుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 278 ప్రాంతాల్లో ఈ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 251 టవర్లకు సంబంధించి అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ పాటికే 181 టవర్ల ద్వారా 4జి సేవలు అందిస్తున్నామన్నారు. వినియోగదారులకు త్వరితగతిన డాటాను పొందుకోటం, పంపించుకునేందుకుఈ నెట్వర్క్ ఉపయోగపడుతుందన్నారు.

స్యాచురేషన్ ప్రాజెక్ట్ ద్వారా మారుమూల ప్రాంతాలకు....

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏ ప్రైవేట్ టెలికాం కంపెనీ అందించలేని ప్రాంతాలలో బిఎస్ఎన్ఎల్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ప్రాథమికంగా 14 ప్రాంతాల్లో ఇలాంటి సేవలు అందించేందుకు ఎంపిక చేసామన్నారు. తొలుత నల్లమల అటవీ ప్రాంతం దోర్నాల మండలం చిన్నమంతనాల, కొర్రప్రోలు, చిలకచర్లగూడెం, నల్లగుంట్ల, ఎగువ చెర్లోపల్లి, అర్ధవీడు మండలం ఎర్రగుంట్ల, సిఎస్‌పురం మండలం మాలమీదపల్లి ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. చెన్నపాలెం, బిళ్లగొంది పెంట, పెద్ద మంతనాల ప్రాంతాలకు అనుమతులు లభించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. సిఎస్ పురం ప్రాంతంలోని బోయమడుగుల, తుంగోడు, దేవకిమర్రి, విరంచిపురం ప్రాంతాలకు సంబంధించి అనుమతులు లభించాల్సి ఉందన్నారు. కందుకూరు ప్రాంతంలోని చుట్టుగుంట, కృష్ణాపురం, ఒంగోలు ప్రాంతంలో సర్వేరెడ్డిపాలెం నుంచి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు నుంచి సిఫార్సులు అందితే త్వరితగతిన అనుమతులు లభించే అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ సభ్యులు సిఫార్సులు ద్వారా అవసరమైన ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు విస్తృత పరిచేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

ఫైబర్ టు ద హోమ్ (ఎఫ్ టి టి హెచ్) సేవలు...

ఫైబర్ ఆప్టికల్ కేబుల్ సిస్టం ద్వారా డేటా ట్రాన్సిమిట్ చేసే సదుపాయాన్ని బిఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తెచ్చినట్లు అనంత కుమార్ తెలిపారు. తద్వారా టెలికం రంగంలో ఏ కంపెనీ అందించని రీతిలో వాయిస్ మరియు డేటా సేవలు వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా, గృహ వినియోగదారులు, వ్యాపార, వాణిజ్య, పరిశ్రమ రంగాల వారు ప్రయోజనం పొందే వీలుంటుందన్నారు. బిఎస్ఎన్ఎల్ లో 'ఛానల్ పార్టనర్స్' పేరున ప్రైవేట్ ఆపరేటర్లకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. దీని కోసం పెట్టుబడి పెట్టగల ఉత్సాహవంతులు బిఎస్ఎన్ఎల్ తో ఒప్పందం చేసుకోవాలని ఆయన కోరారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

బెదిరింపు, దాడి కేసులో సిద్దెనపాలెం గ్రామానికి చెందిన గడ్డం సుబ్బయ్యను అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సంపత్ కుమార్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఐటీవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 296లో 8.32 సెంట్ల భూమిని సిద్దెనపాలెం గ్రామానికి చెందిన గడ్డం సుబ్బయ్య, కొల్లి వీరబ్రహ్మయ్య అనే పేర్లపై మోసపూరితంగా ఆన్‌లైన్ చేయించుకొని వాటిని యర్రగొండపాలెంలోని సహకార బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందారని గ్రామస్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గడ్డం సుబ్బయ్య గురువారం ఉదయం 'నా మీదనే ఎస్పీకి ఫిర్యాదు చేస్తారా?' అంటూ అదే గ్రామానికి చెందిన మాగులూరి లక్ష్మమ్మ అనే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బూతులు తిడుతూ, చంపుతానని బెదిరించి, దాడి చేయబోయాడని మాగులూరి లక్ష్మమ్మ ఫిర్యాదు ఇచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసి గడ్డం సుబ్బయ్యను అరెస్టు చేశారు. మార్కాపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.



మాట్లాడుతున్న డాక్టర్ కరుణాకర్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

ఐఈఈఆర్‌డి స్వచ్ఛంద సేవా సంస్థ, ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నంబూరువారి పాలెంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.శకుంతల, డాక్టర్ ఏ కరుణాకర్ రావు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 110 మందికి ఉచితంగా ఆయుర్వేద మందులు, ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ బత్తుల కిరణ్ చంద్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆరోగ్య సమస్యల వల్ల అనేకమంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డాక్టర్ ఆర్.శకుంతల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి ప్రసాదించిన ఆయుర్వేద మూలికలు, ఆయుర్వేద మందుల ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందాలన్నారు. డాక్టర్ ఏ.కరుణాకర్ మాట్లాడుతూ ఆయుర్వేదం ద్వారా మన పూర్వీకులు 100 సంవత్సరాలకు పైగా ఆరోగ్యవంతులుగా ఉన్నారన్నారు.

కుక్కల దాడిలో పశువైద్యుడికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలో పలు వీధులలో కుక్కల బెడద ఎక్కువైంది. శనివారం పట్టణంలోని ఎన్.టి.ఆర్ నగర్ సమీపంలో పశువైద్యులు వెంకటేశ్వర్లు వ్యక్తిగత పనులపై కాలనీలోకి వెళ్లగా దాదాపు పదులు సంఖ్యలో వీధి కుక్కలు ఆయనపై దాడి చేశాయి. స్థానికులు గమనించి వెంటనే కుక్కలను చెదరగొట్టి ద్విచక్రవాహనంపై ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వ్యాక్సిన్ అందించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడదను పట్టణంలో నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు నీటిపై 'టీడీపీ' నిరసన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక బస్టాండ్ సెంటర్లో వంతెన దెబ్బతిని కలుషిత మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడం పట్ల టిడిపి ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద గల కూరగాయల మార్కెట్ ముందు ఉన్న వంతెన దెబ్బతినడం వల్ల మురుగునీరు రోడ్డుపై నిలిచి ప్రజలు అంటు వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్ప రాజు శ్రీనివాసరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు బొడ్డు శంకరబాబు, బాపట్ల పార్లమెంట్ టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి పావులూరి నారాయణస్వామి చౌదరి, నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు వెంకట్రావు, కొప్పోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి-కొల్లూరు

ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. శనివారం ప్రజా సంఘాల నాయకులు కొల్లూ రులో ఇంటి వద్ద ఓటర్లను కలిసి లక్ష్మణ్ రావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగ, రైతు, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం శాసన మండలిలో, ప్రజా వేదికలపై ప్రశ్నిస్తున్న వ్యక్తి లక్ష్మణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.కృష్ణమోహన్, టి.సురేష్, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



లెటర్లు చూపుతున్న అమెరికా విద్యార్థులు

అమెరికా చేరుకున్న ఐలవరం విద్యార్థుల లెటర్స్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఐలవరం విద్యార్థులు పంపించిన పెన్పాల్ లెటర్స్ అమెరికాకు చేరాయి. స్కైప్ ద్వారా ఐలవరం పాఠశాల విద్యార్థులకు చూపించారు. ఇప్పటికే మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రపంచంలోని సుమారు 60 దేశాలకు పైగా నిత్యం పెన్పాల్ లెటర్స్ మరియు స్కైప్ ద్వారా ఆయా దేశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో సంభాషిస్తూ ఉంటారు. ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ సారథ్యంలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టును సాధిస్తున్నారు. దీనిలో భాగంగానే అమెరికా విద్యార్థులకు 10 లెటర్స్‌తో పాటు భారతదేశ 7 వింతలలో ఒకటైన తాజమహల్‌ను కూడా అక్కడకు పంపించడంతో అమెరికా ఉపాధ్యాయులు థామస్ (నెబ్రస్కా) దానిని పరిశీలించి ఐలవరం విద్యార్థులను అభినందించినట్లు పాఠశాల హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు తెలిపారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ముండ్లమూరు

రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శనివారం మండలంలోని ఉమామహేశ్వర గ్రామంలోని మిర్చి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మిర్చి క్వింటా ధర రూ.23 వేలు ఉందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మిర్చి రూ.12 వేలుగా ఉందన్నారు. పెట్టుబడి రాక రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రైతు భరోసా కింద నగదు వేస్తామని చెప్పారే కానీ ఆచరంలో చేయలేదన్నారు. ప్రభుత్వ ఎకరాకి నష్టపరిహారం కింద రూ.20వేలు అందజేయాలన్నారు. ముందుగా మారెళ్ల గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన చొప్పరపు కోటేశ్వరావు కుటుంబ సభ్యులను, ఉమామహేశ్వరపురంలోని సాధు కోటిరెడ్డి కుటుంబాన్ని, ఎస్సీ కాలనీలోని ఎలుగందల దెబ్బయ్య కుటుంబాన్ని, వరగాని సీతమ్మ కుటుంబాన్ని, చొప్పవరపు గోవిందు వెంకటేశ్వర్లు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మాజీ కన్వీనర్ సూది దేవర అంజయ్య, జడ్పీటీసీ తాతపూడి మోజేష్ రత్నం రాజు, సుంకర బ్రహ్మానంద రెడ్డి, బంక నాగిరెడ్డి, అబ్బనీ అంజిరెడ్డి, ఇరుగుల కొండారెడ్డి, గోపన్న బోయిన శ్రీనివాసరావు, బిజ్జం కృష్ణారెడ్డి, గొంది వెంకట అప్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం శోచనీయం

డాక్టర్ పాలేటి రామారావు

ప్రజాశక్తి - చీరాల

చీరాలలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు విగ్రహ ఏర్పాటు విషయమై తలెత్తిన వివాదంలో పరిశీలన కోసం చీరాల వచ్చిన జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ వ్యవహరించిన తీరు సక్రమంగా లేదని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఆరోపించారు. శనివారం తన వైద్యశాలలో జరిగిన విలేఖరుల సమావేశంలో పాలేటి మాట్లాడారు. పట్టణంలో ఎన్టిఆర్ విగ్రహం ఏర్పాటు కోసం తాను, టిడిపికి మద్దతుగా ఉన్న కౌన్సిలర్లు కౌన్సిల్ ఆమోదం కోసం దరఖాస్తు చేసినట్లు చెప్పారు. ఈ నెల ఒకటో తేదిన కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. విగ్రహం ఏర్పాటు చేయబోగా దాన్ని వివాదం చేశారన్నారు. ఈ విషయమై పరిశీలన కోసం అంటూ వచ్చిన జెసి స్థానికంగా సమావేశం జరిపి రాజకీయ నేతలా వ్యవహరించారన్నారు. విగ్రహాల వ్యవహారంలో తమకు ఎలాంటి అధికారాలు లేవన్న జెసి అసలు సమావేశం ఎందుకు జరిపారన్నారు. పట్టణం నడిబొడ్డున ఎన్టిఆర్ విగ్రహం పెట్టేందుకు పూనుకోగా జేసీ వచ్చి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు వద్ద ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయడం కరెక్టు కాదన్నారు. ఆ ప్రదేశం ఎప్పటి నుంచో టాక్సీ స్టాండ్‌గా ఉందన్నారు.



మాట్లాడుతున్న పాలేటి రామారావు

పట్టణ రోడ్లలో అన్ని విగ్రహాలు పెట్టినప్పుడు ఎన్టిఆర్ విగ్రహం పెట్టటానికి ఎందుకు అనుమతి లేదో చెప్పాలన్నారు. ఇప్పటి వరకు కొనసాగుతున్న సాంప్రదాయం ప్రకారం మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం చేస్తే అది ఇక ఫైనల్ అయిన్నట్లే అన్నారు. ఇక రాజకీయ పార్టీల వారితో కూర్చొని వారి అభిప్రాయాలు సేకరించాల్సిన అవసరం ఆయన ఏముందని పాలేటి ప్రశ్నించారు. జెసీ అనుసరించిన వైఖరి గురించి ప్రభుత్వంలోని పెద్దలకు తాను ఫిర్యాదు చేస్తానన్నారు.

బాపట్ల ఎంపిని కలుస్తా

తాను పట్టణంలో ఎన్టిఆర్ విగ్రహం పెట్టాలనుకోవడం వెనుక బాపట్ల ఎంపి టి.కృష్ణప్రసాద్ ఉన్నారని ఆరోపించడాన్ని పాలేటి ఖండించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే కొండయ్యతో పాటు ఎంపీ గెలుపుకు కూడా తనవంతు కృషి చేశానన్నారు. పోలింగ్‌కు ఏజెంట్లను పెట్టానన్నారు. ఇప్పటివరకు తాను ఎంపిని కలువలేదని రానున్న రోజుల్లో ఎంపిని కలుస్తానన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపిని కలవడం తప్పుకాదన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో నీటి పన్ను బకాయిలు రూ. 1.70 కోట్లు ఉన్నాయని, వాటిని వెంటనే వసూలు చేయాలని తహశీల్దార్ కె.రవిబాబు ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది, సాగు నీటి సంఘాల అధ్యక్షులు, రైతుల నుంచి నీటి పన్ను బకాయిలు వసూలు చేయడంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆయన కోరారు. ఇందుకు రైతులు వారికి సహకరించి తక్షణమే నీటి పన్ను బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న రామరాజు

బాలోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బాలల కోసం నైపుణ్యం కలిగిన వారంతా భాగస్వాములు కావాలని "బాలోత్సవం" రాష్ట్ర కన్వీనర్ రామరాజు పేర్కొన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో ఒంగోలు పివిఆర్ బాలురు పాఠశాలలో నిర్వహించనున్న "బాలోత్సవం" కార్యక్రమ నిర్వహణపై శనివారం నాడు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కే సుబ్రహ్మణ్యం అధ్యక్షతన యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన వర్క్ షాప్ లో మాట్లాడారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనడానికి ముందుకు రావాలని కోరారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారంతా భాగస్వాములు కావాలని సూచించారు. బాలోత్సవం జిల్లా అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలల కోసం పెద్దలు, మేధావులు కృషి చేయవలసి ఉందని తెలిపారు. సమాజంలోని రుగ్మతలకు బాలలు ప్రభావితం కాకుండా చర్యలు చేపట్టవలసిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. బాలోత్సవం పేర్ల నమోదుకు 12తేదీ వరకు గడువు పొడిగించినట్లు వర్క్ షాప్ నిర్ణయించింది. ఈ సందర్భంగా, వివిధ ఈవెంట్లకు కమిటీలు, కన్వీనర్లను నియమించారు. కార్యక్రమంలో 500 మంది వివిధ రంగాలకు బాధ్యత వహించే విధంగా వర్క్ షాప్ నిర్ణయం చేసింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వీరాంజనేయులు, కోశాధికారి ఎస్ రవి, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజీ శ్రీనివాసులు, విజిల్లా అధ్యక్షులు అబ్దుల్లా హై, బాలోత్సవ నాయకులు వి బాలకోటయ్య, సి హెచ్ వినోద్ ,కె ఎఫ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్‌లో శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేట్ లెవెల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. హై స్కూల్ క్రీడా మైదానంలో చీరాల పాత్రికేయుల మిత్రులు నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు హాజరై, తొలిబంతిని గోల్ కొట్టి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయనతో పాటు మహిళా నాయకురాలు కారంపూడి పద్మిని, సీనియర్ జర్నలిస్టు ఎస్.వి. కృష్ణారెడ్డి, దేవరపల్లి దిలీప్ కుమార్, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫుట్‌బాల్ ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ సందర్భంగా, ఎన్.ఆర్.పి.ఎం హై స్కూల్ క్రీడా మైదానం యువకుల క్రీడా స్ఫూర్తితో నిండిపోయి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సంతరించుకుంది.ఇ లాంటి పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు దోహదపడతాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం

నేడు శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అత్యాధునిక వైద్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే శ్రీ గోరంట్ల సూపర్ స్పెషలిటి హాస్పిటల్ లక్ష్యమని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోరంట్ల రాజేష్ తెలిపారు. చీరాల ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ చీరాల ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో తెచ్చిన హాస్పిటల్ గోరంట్ల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అన్నారు. పట్టణంలోని స్థానిక విజ్ఞాన భారతి కళాశాల ఎదురుగా ఉన్న తమ హాస్పిటల్ చీరాల పరిసర ప్రాంత ప్రజలకు మరింతగా విశేష వైద్య సేవలు అందించాలని సంకల్పంతో హాస్పిటల్ భవనాన్ని నిర్మించి నేడు ప్రారంభోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టామన్నారు. తమ హాస్పిటల్‌లో జనరల్ మరియు షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ గోరంట్ల రాజేష్, చిన్నపిల్లల వైద్యం నిపుణులు డాక్టర్ నన్నపనేని శ్రావణి, ఎముకలు మరియు కీళ్ల వైద్య నిపుణులు జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ గోరంట్ల కృష్ణ చైతన్య, ఐవిఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ మేడికొండ ప్రీతి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె వి సుబ్బారావు, మెదడు మరియు నరముల వైద్యాన్ని నిపుణులు డాక్టర్ యస్ శ్రీజ అందుబాటులో ఉండి గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోనే మొట్టమొదటి సారిగా 100 పడకల హాస్పిటల్, 24 గంటలు అందుబాటులో మెదడు మరియు నరముల వైద్య నిపుణులు, గుండె వైద్యనిపుణులు ఉంటారన్నారు. నేడు ఉదయం 8:51 నిముషాలకు జరుగనున్న హాస్పిటల్ ప్రారంభోత్సవానికి మంత్రి గొట్టిపాటి రవి, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగశన నరేంద్ర వర్మ, డిఎంఅండ్‌హెచ్ఓ విజయమ్మ, పోలవరం ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. తమ హాస్పిటల్‌లో వైద్య సేవలను చీరాల పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ప్రారంభానికి సిద్ధమైన హాస్పిటల్

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, యూత్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బధరుల పాఠశాలలోని చిన్నారులకు దుస్తులను, బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్ మూడుపూట్ల పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, కన్వీనర్ పిచ్చుల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు తమ్మినేని వెంకట్ రెడ్డి, గుడిపాటి ఖాదర్, జిలాని ,పచ్చువ వెంకటేశ్వర్లు, మచమారి చెంచిరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, బాలు ఓబుల్‌రెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, సిహెచ్.నాగార్జున యాదవ్, యు.శ్రీనివాసులు రెడ్డి, బి.ప్రసాద్ రెడ్డి, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

పామూరు.: కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తిరుగలిగిన గ్రామానికి చెందిన టిడిపి నాయకులు హైదరాబాదులో మల్లీ బోయిన బాలబ్రహ్మం నివాసంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్లపాడు ఎంపిటిసి పొట్ట నాగార్జున, బట్ల కోటేశ్వరరావు, దాసరి నారాయణ, మలిపోయిన శివ, బొట్ల నాగేంద్ర, కోటేష్ బొట్ల నాగేశ్వరరావు, బోట్ల నాగకొండయ్య, మాజీ సర్పంచి ఎం.గురుబ్రహ్మం. తదితరులు పాల్గొన్నారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక మదన వేణుగోపాల్ స్వామి దేవాలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, బొల్లా నరసింహారావు, డివి మనోహర్, రమణయ్య, శ్రీనివాసులు, నాయబ్ రసూల్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు



పామూరులో పూజలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వెలిగండ్ల : స్థానిక టిడిపి కార్యాలయంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు రైతు మండల అధ్యక్షుడు మీనిగ కాశయ్య, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, గుంటక జయరామిరెడ్డి, బొబ్బ రమణారెడ్డి, సోమిశెట్టి వెంకట సుబ్బారావు, బైసాని మనోహర్, ఆకుల రాజ్ కుమార్ నాయుడు, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కేలం చెన్నకేశవరెడ్డి, నాసర్, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్.పురం: కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, సర్పంచి శ్రీరామ్ పద్మావతి, అట్లూరి రామకష్ణంరాజు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బత్తుల వెంకటాద్రి, ఉపసర్పంచి పాములపాటి నరసయ్య, కామన బోయిన వెంకటస్వామి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఆమడసాని బాలకేశవరెడ్డి, పసుపులేటి గురుకష్ణ, ఎస్‌కె.రజ్జబ్‌బాషా, పోకల రవిచంద్ర, జగన్నాథం లక్ష్మి, దేవేండ్ల తిరుపతయ్య, చావా శేఖర్, శ్రీనివాసులు, ప్రసాద్, భూషణం పాల్గొన్నారు.

బెంగళూరులో ఉగ్ర పుట్టినరోజు వేడుకలు

టిడిపి యువనేత మన్నేపల్లి కార్తీక్ ఆధ్వర్యంలో బెంగళూరులో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సమ్మన రమణయ్య, మన్నేపల్లి సాయి, రమణారెడ్డి, సురేంద్ర, కొండయ్య, పడే బాలు తదితరులు పాల్గొన్నారు.



సిఎస్‌పురంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు



హైదరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

నేడు జడ్పీ సమావేశం

- హాజరు కానున్న ఇద్దరు మంత్రులు

- వేసవి సమస్యలపై చర్చే ప్రధానం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వేసవి సమస్యలే ఎజండాగా జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఆదివారం జరగనుంది. గతంలో నిర్వహించిన సమావేశంలోనే సభ్యులు పలు అంశాలపై మాట్లాడారు.వాటికి మంత్రులే ఎక్కువ సమాధానాలు చెప్పారు. ఈసారీ సమస్యలపై వాడివేడిగానే చర్చ సాగే అవకాశం లేకపోలేదు. జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సమావేశం ఎజండా రూపొందించారు. ఈ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హాజరు కానున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు పూర్తిస్థాయిలో హాజరు కానున్నారు. ప్రస్తుతం వేసవి సమస్యలే ఎజండా కానున్నాయి. ఎందుకంటే నిన్నటి వరకూ చలితీవ్రంగా ఉంది. ఇపుడు పగటి పూట ఎండలు తీవ్రత పెరిగింది. మరోవైపు తాగునీటి సమస్య ఏర్పడుతోంది. పశ్చిమాన ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 120 ఆవాసగ్రామాలకు నీటిని అందిస్తున్నారు. రానున్న కాలంలో వీటి సంఖ్య ఇంకా పెరగనుంది. తాగునీటి సమస్యపై గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు వేసవి కార్యాచరణ ప్రణాళిక కూడా రూపొందిస్తారు. వీటికి నిధులు కీలకం.ఇక సమావేశానిక ి మంత్రులు హాజరవుతున్నందున సభ్యుల్లోనూ ఆశ పెరిగింది.తమ సమస్యలకు పరిష్కారంతోపాటు నిధులు కూడా ఇచ్చే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు. సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు గత సమావేశంలో మంత్రులే సమాధానాలు చెప్పారు. అధికారుల నుంచి వివరణలు ఇప్పించారు. సభ్యులు అడిగిన సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఆదేశాలు ఇచ్చారు. ఇపుడు వాటిస్థితి ఏమిటన్నదీ చూడాలి. ఇక జడిపి ప్రతిపక్షంగా ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు ఆశించడం తప్ప మరో ప్రత్యామ్నాయం కూడా కనిపించడంలేదు. ప్రస్తుతం పాలకపక్షం వైసిపి చేతిలో ఉంది. ఇక్కడ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనలో మంత్రులు కనిపించడం లేదు. సమస్యలపై సాగే చర్చకు సమాధానాలు ఇవ్వడం, పరిష్కారం చూపడమే ఎజండాగా ప్రసుతానికి జడ్‌పి పరిమితమైంది. ఏదేమైనా మంత్రులు హాజరువుతున్నందున సభ్యులు తమ మండలాల్లోని అన్ని రకాల సమస్యలపై గళం విప్పే అవకాశం ఉంది.



టాలెంట్ టెస్టును పర్యవేక్షిస్తున్న నాయకులు

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

శివకవి మల్లికార్జునరావు మెమోరియల్ సారధ్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ శనివారం నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద జూనియర్ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకురాలు యావని మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు రాబోవు కాలంలో మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ ద్వితీయ తతీయ బహుమతుల అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. తొలుత పరీక్ష పత్రాలను రేస్ కాలేజ్ డైరెక్టర్ రాజా, పిఎన్‌ఎం ప్రకాశం జిల్లా పూర్వ కార్యదర్శి గంధవల్ల బాలకష్ణ విడుదల చేశారు. టాలెంట్ టెస్టు వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవరపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ శాస్త్రి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. వినోద్, నెల్లూరు జిల్లా సర్వ శిక్ష అభియాన్ సిఆర్‌పి ప్రసూనాంబ, సుబ్బారావు ,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విస్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

క్విస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్విస్ ఫెస్ట్ - 2025 ఉత్సాహంగా సాగు తోంది. రెండో రోజు రికార్డు స్థాయిలో విద్యార్థులు హాజరయ్యారు. టెక్నికల్, కల్చరల్స్, స్పోర్ట్స్ లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్విస్ ఫెస్ట్ ఈసారి మరింత ఉత్సాహంగా జరుగు తోందన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. అనేకమంది ఆన్ లైన్ ద్వారా పేపర్ ప్రజంటేషన్స్ చేసినట్లు తెలిపారు. టెక్నికల్ ఎక్స్ పోలో భాగంగా నిర్వహించిన పేపర్ ప్రజంటేషన్, రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్ ఎక్స్ పో, టెక్ క్విజ్, టెక్ ఫన్, పోస్టర్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్ వంటి అంశాల్లో 40 కళాశాలల నుంచి దాదాపు 700 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన అన్ని అంశాలను స్క్రూటినీ చేసి బహుమతులు సాధించిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్ పోటీలలో పలు కళాశాలలకు చెందిన దాదాపు 1200 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు సైతం ఉత్సాహంగా సాగాయి. క్విస్ స్కూల్ విద్యార్థుల నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం ముగింపు సభ ఫౌండర్స్ డే జరపనున్నారు. ముగింపు కార్యక్రమానికి ఎన్‌ఐటి రాయ్‌పూర్ డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి.హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, వివిధ విభాగాల డైరెక్టర్లు, డీన్‌లు, హెచ్‌ఒడిలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

సందడి చేసిన సింగర్ సమీర భరద్వాజ్

క్విస్ ఫెస్ట్ లో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ కాన్సర్ట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సింగర్ సమీర భరద్వాజ్ తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. బ్యాండ్ కాన్సర్ట్తో వారి సంగీతానికి విద్యార్థులు నత్యాలు చేసి, కేరింతలు కొట్టారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరు

ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

1-19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంపై శనివారం డిఎం,హెచ్‌ఒ కార్యాలయంలో ముఖ్య అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాది నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు అర మాత్ర నీళ్లలో కరిగించి తాగించాలన్నారు. ఒకరోజు ముందే ఎంపిడిఒల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. నులి పురుగులు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు హాని కలిగిస్తాయన్నారు. రక్తహీనతకు దారి తీస్తాయన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశ్రుభ్రత పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశా లల్లో వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. చేతులు శుభ్రంగా కడిగిన తరువాత మాత్రలు మింగించాలన్నారు. తరువాత రెండు గంటల పాటు ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాల విద్యార్థుల డైరీలలో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ముందుగానే రాసి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథిదేవి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నాలుగు రోజులపాటు అన్నమయ జిల్లాలోని అనంత రాజుపేట ఉద్యాన కళాశాలలో జరిగాయి. ఈ క్రీడా పోటీలలో సిఎస్ పురం కదిరి బాబురావు ఉద్యాన కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. లక్ష్మి హారిక లాంగ్‌జంప్, హైజంప్‌లో మొదటి స్థానం, విష్ణు 100 మీటర్స్ రన్నింగ్‌లో రెండవ స్థానం, లాంగ్‌జంప్‌లో మూడవ స్థానం, చరణ్ తేజ 200 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, పవన్‌కుమార్ హైజంప్‌లో ముడవ స్థానం, ఆదిలక్ష్మి క్లే మోడలింగ్‌లో మూడవ స్థానం సాధించారు. అన్ని క్రీడల్లో పోటీపడి ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని వెలుగువారిపాలెంలో హైదరాబాదు ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర పరీక్షా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పొదిలికి చెందిన ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యులు డాక్టర్ డి కిషోర్ కంటి సంబంధిత సమస్యలున్న వారిని పరీక్షించి సలహాలు, సూచనలు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన, కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా మార్కాపురంలో తామే స్వయంగా తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి వారి స్వగ్రామాలకు క్షేమంగా చేరుస్తామని అన్నారు. 50మంది పరీక్షలు చేయించుకోగా వారిలో కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు అవసరమైన 15మందికి సోమవారం మార్కాపురంలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ముందుగా ఉచిత నేత్ర వైద్య శిబిరంను ఎస్ఎంసి చైర్మన్ సిహెచ్ అనిల్, ప్రధానోపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దేవయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమానికి సరుకులు అందజేస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

తూర్పు చౌటపాలెం గ్రామానికి చెందిన కాలే మోక్షితశ్రీ పుట్టినరోజు సందర్భంగా దర్శి, కురిచేడురోడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు 50కేజీల బియ్యం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి, శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడారు. తమ బిడ్డ పుట్టినరోజు సందర్భంగా ఇలా సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆమె తండ్రి వెంకటరావు, తల్లి కాలేసుకన్య, అక్క తేజశ్రీ, నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు సన్మానం



మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానిస్తున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసిపి అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి సహకారంతో తనకు ఈ పదవి దక్కిందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శిరుగూరి కోటేశ్వరావు అన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డిని కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతను నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, గనివెనపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీ వెంకటేశ్వర్లు, మార్కాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు ఎలూరి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటనారాయణ, నాయకులు పి వెంకటసుబ్బయ్య, ముత్యాల కాశయ్య, శేఖర్, సోషల్ మీడియా మండల కో కన్వీనర్ పాతకోట బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



గణేశునిపల్లి, గుంత చెన్నంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలో లింక్ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో అనేక గ్రామాలను కలుపుతూ గతంలో లింక్ రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అయితే కొంతమేర మాత్రమే నిధులు వెచ్చించి రోడ్లు వేసినప్పటికీ అవి ప్రస్తుతం చెట్లతో నిండిపోయి నడిచేందుకు వీల్లేని విధంగా ఉన్నాయి. రవాణాకు అనుకూలంగా లేకపోవడంతో ఆ రోడ్లను తిరిగి అభివృద్ధి చేసేందుకు కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టి సారించి రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. ఏకనాపురం నుండి బోయమడుగుల గ్రామానికి వెళ్లేందుకు 4.5 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మించారు. అరివేముల, చెర్లోపల్లి, ఏకనాపురం గ్రామాల ప్రజలు బోయమడుగుల వెళ్లాలంటే ఈ రోడ్డు అతిదగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డు గురించి అధికారులను అడిగినప్పటికీ ఫారెస్ట్ క్లియరెన్స్ కావాలంటూ సమాధానం చెప్తున్నారని తెలిపారు. గతంలో రోడ్డు వేసేటప్పుడు లేనిది ఇప్పుడు ఎందుకు చెబుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కోయిలంపాడు నుండి పెదరాజుపాలెం వరకు లింక్ రోడ్డు నిర్మాణం చేశారని తెలిపారు. ఈ రోడ్డు మార్గం గుండా పెద్దిరెడ్డిపల్లి మీదుగా ఉదయగిరి వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది. కానీ ఆ రోడ్డు పనులు ఆగిపోయాయి. రాజుపాలెం నుండి మండల కేంద్రానికి వచ్చేవాళ్ళకు ఈ రోడ్డు దగ్గరగా ఉంటుంది. గణేష్‌నిపల్లి నుండి గుంతచనంపల్లె వరకు రోడ్డు నిర్మాణం చేశారు. గతంలో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. కానీ ఇంతవరకు ఆ రోడ్డును గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఇలా మండలంలో అనేక గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్లు చాలా ఉన్నాయి. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కావున శాసనసభ్యులు శ్రద్ధ వహించి లింకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు.

బాపట్ల జిల్లాలో 12 షాపులకు 159 దరఖాస్తులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10శాతం చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 340 షాపులను కేటాయిస్తు గత నెల 21న ఏపీ అబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు బాపట్ల జిల్లాకు 12 షాపులు మంజూరు అయ్యాయి. మద్యం షాపుకు దరఖాస్తు చేసుకునేందుకు రూ.2లక్షలు ఫీజుగా నిర్ణయించారు. రిటైల్ ఎక్సైజ్ పన్ను లో 50 శాతం రాయతీ ఇచ్చారు.ఈ కారణంగా జిల్లాలో 12 షాపులకు గాను 300 వరకు ధరఖాస్తులు వస్తాయని భావించారు. కాని 159 ధరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లాలోని ఇంకొల్లులో గౌడ వర్గానికి కేటాయించిన షాపుకు అత్యధికంగా 32 ధరఖాస్తులు వచ్చాయి.బాపట్ల షాపుకు 28, వేటపాలెం షాపుకు 21, చీరాల, రేపల్లె షాపులకు 12 చొప్పున ధరఖాస్తులు వచ్చాయి. అమృతలూరు, అద్దంకి రూరల్,జె పంగులూరు షాపులకు 9 చొప్పున, కారంచేడు షాపుకు 8, చుండూరు షాపుకు 7, రేపల్లె రూరల్, నగరం షాపులకు 6 చొప్పున ధరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ, గౌడ్ వర్గాల వారికి కేటాయించిన 12 మద్యం షాపులకు 159 ధరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జి దేవదత్తు తెలిపారు. ఈ షాపుల కేటాయంపులకు సంబంధించిన లాటరి పక్రియ ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ జె వెంకటమురళి సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ధరఖాస్తు దారులందరు ఆ రోజు ఉదయం 8 గంటలకు హజరు కావాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ మాల్యాద్రి

ప్రజాశక్తి - పర్చూరు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మాల్యాద్రి పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పర్చూరులోని ఇందిరా కాలనీలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెనిద్ర ద్వారా నేరాలను అదుపు చేయవచ్చుని చెప్పారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు, నేరాలు జరుగుతాయని ముందస్తుగా తెలిస్తే పోలీసులకు చెప్పాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి

ఆసుపత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం డాక్టర్ సుమన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలని కోరారు. మందులు అవసరమైనవి తెప్పించుకోవాలని సూచించారు. మార్చురీ రూమును ఏర్పాటు చేసుకునే విధంగా దాతల ద్వారా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ సోనార్‌బాబు, సంఘ సేవకులు జీవి రత్నంతో పాటు వైద్యులు గీతా, పద్మ, సుప్రియ పాల్గొన్నారు.



ఓణీల ఫంక్షన్‌లో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

చిన్నారికి బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని పెదవియ్యాలవాడ గ్రామంలో అంకశాల మురళీమోహన్ కుమార్తె ఓణీలు ఫంక్షన్‌కు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం హాజరై ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పులి ప్రసాద్‌రెడ్డి, పోతంశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

జిల్లాలోని సహాయ సాంఘిక సంక్షేను అధికారి పరిధిలో ఉన్న 11 సాంఘిక సంక్షేమ వసతి గృహల్లోని విద్యార్థినీ, విద్యార్థులను క్రీడలలో మంచి ప్రావీణ్యం, ప్రోత్సాహం ఇచ్చేదిశగా ఆంధ్రపదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రతి వసతి గృహానికి టెన్నికాయిట్ రింగ్స్ 10, క్యారం బోర్డులు–2, చెస్ బోర్డులు–5, షటిల్ కాక్‌లు 4 ఆరు పీసులు గల బాక్సీలు, షటిల్‌బ్యాట్స్–4, షటిల్ నెట్‌లు–2, స్కిప్పింగ్ రోప్ (అమ్మాయిలకు) - 1, వాలిబాల్–2, వాలిబాల్‌నెట్–1, త్రో పివిసి విత్ రింగ్ 1కెజి సామర్థ్యం కలిగింది, షాట్‌పుట్ బాల్–1 చొప్పున 11 వసతి గృహాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. వసతి గృహం లోని ప్రతి విద్యార్థి చదువుతోపాటుగా క్రీడలలో ముందంజ సాధించే విధంగా ప్రొత్స హిస్తున్నట్లు సహయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్‌కె రాబియా బేగం తెలిపారు.



సుబ్బులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లలిత్‌సాగర్

సుబ్బులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

నగర పంచాయతీలోని చింతలపాలెంలోని కౌన్సిలర్ కనకం శ్రీనివాసరావు మాతృమూర్తి కనకం సుబ్బులు ఇటీవల మృతి చెందారు. శనివారం ఆమె దశదిన కర్మ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ కనకం సుబ్బులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేరాల నియంత్రణకే 'పల్లె నిద్ర'

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


పల్లెనిద్రలో భాగంగా గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు ప్రతి శుక్రవారం రాత్రి జిల్లా పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ బాపట్ల మండలం నందిరాజు తోట వద్ద గల హైదర్ పేట గ్రామంలో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, వాటి నుంచి బయటపడడానికి అప్రమత్తంగా వ్యవహరించ వలసిన తీరు, రోడ్డు భద్రత నియమాలు ఇతర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు, రక్షణ పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అసాంఘిక కార్యకలాపాల గురించి ఖచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఏదైనా అనుకోని రోడ్డు ప్రమాదంకు సంబంధించిన తలకు, మెడ భాగాలకు గాయాలు కాకుండా హెల్మెట్ రక్షిస్తుందన్నారు. తద్వారా ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాల గురించి మోటార్ వాహన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొంతమంది వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వాట్సాప్‌లో టెలిగ్రాములో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయడం, ఫోన్ నెంబర్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పడం వంటివి చేయరాదని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి నగదు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరానికి గురి అయిన 24 గంటల్లోపు ఫిర్యాదు చేస్తే మీ నుండి సైబర్ నేరగాళ్లు దొంగలించబడిన నగదును మొత్తం ఫీజ్ చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. సమయం గడిచేకొద్దీ నగదు తిరిగి పొందడం చాలా కష్టంగా మారుతుందని తెలిపారు. కావున సైబర్ నేరగాళ్ళ బుట్టలో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటుగా బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు, స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'సన్ రైస్ ఆగ్రో' వ్యవసాయ ఉత్పత్తుల ఆవిష్కరణ



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సన్ రైస్ ఆగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవసాయ ఉత్పత్తులను జిల్లా కేంద్రమైన ఒంగోలులో శనివారం ఆవిష్కరించారు. తొమ్మిది రకాల ఆగ్రో ప్రోడక్ట్స్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఏ శివ నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ నూతన వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ఆంధ్రప్రదేశ్లోని రైతులకు అధిక దిగుబడులు మరియు అననుకుల పరిస్థితులు కూడా ఎదుర్కొని రైతులకు పూర్తిస్థాయి పంటలు చేతికి వచ్చేలా ఈ వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించినట్లు తెలిపారు. క్లినికల్ ట్రైల్స్ లో 100 శాతం ఫలితాలు వచ్చిన తర్వాతే మార్కెట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. సన్ రైజ్ అగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫౌండర్ మరియు చైర్మన్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మేము తీసుకొస్తున్న ఈ తొమ్మిది రకాల ప్రొడక్ట్స్ రైతులకు ప్రస్తుతం అడ్వాన్స్ టెక్నాలజీతో పాటు భూమి యొక్క సారంతో ముడిపడి వారి పంట పొలాలలో సాగు చేసే పంటలను అధిక దిగుబడిలో వచ్చేలా తయారు చేశామని తెలిపారు. కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుతం విదేశాల్లో ఇప్పటికే నూతన వంగడాలు ఈ ప్రొడక్ట్స్ ద్వారా అక్కడ పంటల అభివద్ధి చెందాయని, మార్కెట్లోకి తీసుకు వస్తున్న ఈ ప్రొడక్ట్స్ నుండి ఆంధ్రప్రదేశ్ రైతులకు వారి పండించే పంటలన్నీ మంచి ఉత్పాదనలతో అధిక దిగుబడి వచ్చేలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానంగా సన్రైజ్ ఆగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి రాయల్ సామ్రాట్, సూపర్ స్మార్ట్ 1.-2.-3 త్రిశూలం, గ్రోమిన్ స్పెషల్ సన్ రైస్ బూస్టం గ్రో ఫ్లవర్ రాయల్ స్వర్ణ గోల్డ్ లాంటి ప్రొడక్ట్స్‌ను మార్కెట్ లాంచ్ చేసినట్లు తెలిపారు. ఇందులో రాయల్ స్వర్ణ గోల్డ్ ఈ ప్రోడక్ట్ ద్వారా బెంగాలీ గ్రామ్. పొగాకు కూరగాయల పంటలకు వాటిల్లే అన్ని రకాల పురుగులును అరికట్టటానికి మరియు పైరు ఎదుగుదలకు బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామకష్ణ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

విచారించి అర్హులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విజయ నగర్ కాలనీలో మూడు దశాబ్దాలుగా నెలకొని ఉన్న భూ సమస్య విషయంలో విచారించి అర్హులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో విజయ నగర్ కాలనీలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నాటి భూ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. విజయనగర్ కాలనీలో 1997 సంవత్సరంలో 3.28 ఎకరాల్లో పట్టాలు ఇచ్చారు. కొంతమంది అలాగే వదిలేశారు. చివరకు అక్కడ మొక్కలు పెరిగి చిట్టడవిగా మారింది. కొంతమంది తమ స్థలాలను ఆక్రమించారంటూ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. పట్టాలు ఇచ్చిన స్థలాన్ని పరిశీలించారు. ఎన్జీవోల తరుపున సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు, బాధితులు చెప్పిన విషయాలను ఎమ్మెల్యే సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు దశాబ్దాల భూసమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇళ్ళ పట్టాలు విచారించి అర్హులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.లక్ష్మిప్రసన్న, తహశీల్దారు వాసు, మున్సిపల్ ఇంజినీర్ చెంచయ్య, ఎసిపి సుధాకర్, ఇంజినీరింగ్ అధికారులు, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు, టిడిపి నాయకులు బండారు మదన్, పి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ

ప్రజాశక్తి-వేటపాలెం : మండల పరిధిలోని అక్కయ్యపాలెం పంచాయతీలో ల్యాండ్ కన్వర్షన్ అర్జీలపై శనివారం చీరాల ఆర్డీవో టీ.చంద్రశేఖర్ నాయుడు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ల్యాండ్ కన్వర్షన కోసం మొత్తం నాలుగు అర్జీలు రాగా ఆర్డీవో విచారణ చేపట్టారు. కొత్తపేట రెవెన్యూ భూములలో ప్రభుత్వానికి సంబంధించిన భూమి ఏమైనా ఉందా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండల రెవెన్యూ శాఖ సిబ్బందితో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఫైల్ నడపాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పీ.పార్వతి, సర్వేయర్ ఉడత శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'వ్యాధి నిరోధక టీకాలు' పరిశీలన

ప్రజాశక్తి-అద్దంకి : మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని సింగరకొండపాలెం సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాధికారి ఇన్చార్జ్ డాక్టర్ మనోజ్ ప్రతిజ్ఞ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులందరినీ యువన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల 10వ తేదీన జరిగే జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. మోదేపల్లి ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 4283 మందికి ఆల్బెండొజోల్ మాత్రలు పంపిణీ చేయుటకు సిద్ధంగా ఉన్నామనిన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీ హర్ష ఎంపీహెచ్ఈఓ ఏ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు : మండలంలోని పెద్దలంక గ్రామానికి చెందిన నన్నేపముల చంటికి చెందిన సెల్‌ఫోన్ ఇటీవల కనిపించకుండా పోయింది. దీంతో చంటి భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఐఎంఈఐ నెంబరు సహాయంతో ఎస్ఐ ఎం.శివయ్య మొబైల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకొని ఆదివారం యజమాని చంటికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో అనేక విధాలుగా మోసాలు సైబర్ నేరాలు జరుగుతున్నాయని ప్రజలు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పెన్షనర్లకు వైద్య సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-బాపట్ల

పెన్షనర్లకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాలని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పెన్షనర్స్ డే సందర్భంగా బాపట్ల జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పే కమిషన్‌ను నియమించాలన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి సుబ్బారావు, కె.నరసింహారెడ్డి, రాష్ట్ర సంఘం అదనపు కార్యదర్శి రామానుజ రావు, ఇషాక్, ఎస్.ప్రసాద్ రావు, ఆనందబాబు, పి.నాగేశ్వరరావు పెన్షనర్లు పాల్గొన్నారు.

అవయవదానంపై అపోహలు వీడాలి

ప్రజాశక్తి-బాపట్ల

అవయవదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ పిలుపునిచ్చారు. శనివారం అవయవదానంపై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సౌజన్యంతో ముద్రించిన ప్రచార కరపత్రాలను ఏరియా వైద్యశాలలో ఆయన ఆవిష్కరించారు. డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ అవయవదానంతో మానవులు చిరంజీవులుగా మారవచ్చున్నారు. ఎందరో జీవితాలలో వెలుగులు నింపవచ్చన్నారు. అవయవ దాతల కోసం దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తారక, వంశీలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. గత ఐదేళ్లలో గ్రామాలలో తూతూ మంత్రంగా సీసీ రోడ్లు వేసి మమ అనిపించారని వారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్కువ కాలం లోనే సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతొ గ్రామానికి కొత్త శోభ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పోపూరి హనుమంతరావు, వెంకట రత్తయ్య, ప్రసాద్, సురేష్, రూబెన్, పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న ఏవివి హైస్కూలు పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-బాపట్ల

ఏవివి ఉన్నత పాఠశాలలో 1990-91 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలతో శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 34 యేళ్ళ తర్వాత వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాల్లో ఉన్నామని పూర్వ విద్యార్థి అబ్దుల్ కరీం తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయిని ఉమా సుందరి మాట్లాడుతూ అప్పటి విద్యార్థులు ఉపాధ్యాయులు అంటే భయపడేవారన్నారు.



మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

పొగాకు ,మిర్చి పంటలకు

గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పొగాకు మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జుజ్జూరి జయంతి బాబు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశం నిర్ణయాలను సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పత్రికలకు విడుదల చేశారు. ఈ ఏడాది జిల్లాలో పొగాకు పంట విస్తారంగా సాగు చేశారని, అదే స్థాయిలో బర్లీ పొగాకు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినట్లు తెలిపారు. గతేడాది అత్యధిక ధరలు లభించటంతో చిన్న, సన్నకారు రైతులు విస్తారంగా పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం బర్లీ పొగాకు కొనుగోళ్లు సక్రమంగా లేవన్నారు. దీంతో రైతులు అప్పుల పాలు అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బోర్డు ద్వారా పొగాకు క్వింటాళ రూ. 15 వేల వంతున కొనుగోలు చేయాలని సంఘం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తెగుళ్ల కారణంగా మిర్చిలో పంటలో దిగుబడి తగ్గినట్లు తెలిపారు. ధరలు కూడా పడి పోవడంతో రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని మిర్చిని క్వింటా రూ.25 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. గ్రామ సభల్లో ప్రభుత్వం దష్టికి వచ్చిన భూముల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు పంట ఏడుకొండలు, తిరుపతి రెడ్డి తిప్పారెడ్డి, కొల్లూరు వెంకటేశ్వర్లు, అను సుబ్బారావు, ఎం.బ్రహ్మయ్య, ఎన్.వెంకన్న, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

చాతుర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు

డాక్టర్ శివప్రసాద్ రాజు ఆకస్మిక మృతి

సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండూరు శివప్రసాద్ రాజు(53) గుండెపోటుతో మృతిచెందాడు. ప్రముఖ సర్జన్ గా పేరున్న శివప్రసాద్‌రాజు చాతుర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పేరుతో వైద్యశాల నిర్వహిస్తున్నారు. రోజులాగే శనివారం హాస్పిటల్‌లో అత్యవసర కేసులను పరిశీలించిన అనంతరం ఇంటికి వెళ్లి కొద్ది సేపు విశ్రాంతి కి ఉపక్రమించారు. ఎంతసేపటికి మేల్కొనక పోవడంతో ఆయన భార్య నిద్ర లేపే ప్రయత్నం చేశారు. అప్పటికే శివప్రసాదరాజు మతి చెందినట్లు గుర్తించిన కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శోకస ముద్రంలో మునిగి పోయారు. శివప్రసాద్ రాజు కర్నూల్ మెడికల్ కాలేజ్ విద్యార్థిగా ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో చురుగ్గా పని చేశారు. ప్రకాశం జిల్లాలోనూ ఎస్ఎఫ్ఐ స్టడీ సర్కిల్‌లో క్లాసులు బోధించిన అనుభవం ఉంది. ఒంగోలు రిమ్స్‌లో సర్జన్ గా పనిచేసిన అనుభవం ఉంది. ఈయన ఒంగోలు రిమ్స్‌లో విధులు నిర్వహించినే సమయంలో శస్త్ర చికిత్సలకు గుంటూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఘనత శివప్రసాద్ రాజుకు దక్కింది. ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకున్న అనంతరం కూడా నామమాత్రపు ఫీజులతో వైద్య సేవలు అందిస్తున్నారు. కోవిడ్ కాలంలో ఎన్‌జిబి భవన్‌లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రంలో సేవలందించారు. ఐసోలేషన్ హెల్ప్ లైన్ కు సేవలందించారు. ఒంగోలు నగరంలో మానవతా విలువలు కలిగిన వైద్యుడిగా పేరు గడించారు. దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపుకు సేవలందించారు ఆయనకు భార్య సౌజన్య, కుమార్తె శ్రీదివ్య, కుమారుడు సౌమిత్ ఉన్నారు. శివప్రసాద్ రాజు మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఎం నేతలు ఆయన మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శివర్గసభ్యులు పూనాటి ఆంజనేయులు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. రమేష్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మల్యాద్రి, జిల్లా కార్యదర్శి బి.రఘురాం, నాయ కులు టి.మహేష్, బి.వెంకట్రావు, విశ్రాంత ప్రిన్సిపల్‌ఎవి. పుల్లారావు ఉన్నారు...



శివప్రసాద్‌రాజు (ఫైల్)



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రముఖుల నివాళి....

డాక్టర్ రాజు మతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ వైద్యుడు, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ మదాసి వెంకయ్య, వెంకటరమణ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ బి.బాలాజీ నాయక్, డాక్టర్ సుభాష్, డాక్టర్ కమల, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ యామిని, డాక్టర్ కె. వెంకటేష్, డాక్టర్ పి.హర్షిత, రవి చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నిరంజన్ రెడ్డి, శోభా రెడ్డి, ప్రణతి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సీతారామయ్య, ఉపాస ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి,డాక్టర్ మణి బాబు, డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసనలు

కార్మికుల హక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికే లేబర్ కోడ్‌లు తెచ్చారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కార్మికులు నిరసన తెలిపారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లును తెచ్చి కార్మిక వర్గానికి ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశంగా ఉంది.కార్మికులను కట్టు బానిసలుగా చేసే ఈ చట్టాలను అందరు వ్యతిరేకించాలని,కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లు రద్దుచేసేంత వరకూ కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధంకావాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.



చంద్రబాబు,పవన్, లోకేష్ ఫొటోల మార్ఫింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఒంగోలు రూరల్ పోలీసుల ఎదుట హాజరైయ్యారు. రాంగోపాల్ వర్మను ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ బాబు విచారించారు. రఘురామకష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితురాలిగా ఉన్న డాక్టర్ ప్రభావతి ఒంగోలు ఎస్‌పి కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి చెన్నైలోని అపోలో హాస్పటల్‌లో బైపాస్ సర్జరీ చేయించుకున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నెలకొన్న గ్రానైట్ వ్యాపారానికి సంబంధించి పలు సమస్యలపై గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ భేటీ అయ్యారు.గ్రానైట్ వ్యాపారానికి సంబంధించి పలు సమస్యలను మంత్రి గొట్టిపాటి దష్టికి తీసుకొచ్చారు.కూలీల కొరత, తగ్గిన ఎగుమతులు, గిట్టుబాటు ధర లేకపోడం వంటి పలు అంశాలపై చర్చలు జరిపారు.

ఉచిత ఇసుక విధానం హామీ అమలు కావడం లేదు.రెండు జిల్లాల లోను ఇసుక అందుబాటులో లేకుండా పోయింది.దీంతో ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.బాపట్ల జిల్లాలోని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఇసుక క్యారీలు మూతపడ్డాయి.

బాపట్ల పట్టణం శ్రీనివాస్ నగర్ కాలనీలో సిఎం చంద్రబాబు నాయుడు పేరుతో ఉన్న తొమ్మిదిన్నర సెంట్లు భూమిని ఫోర్జరీ సంతకాలతో తప్పుడు ధవీకరణ పత్రాలు సష్టించి భూమిని కాజేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుగు దేశం పార్టీ భవన నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చిన భూమిని చంద్రబాబు పేరు మీద 2000 సంవత్సరంలో దాతలు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉన్న బాపట్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు 12 మండలాల్లో జరుగనున్నాయి. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 3న నోటిఫికేషన్ జారీ చేశారు. బాపట్ల జిల్లాకు సంబంధించి 12 మండలాల్లో ఈనెల 7న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. పిడిఎఫ్ తరపున కెఎస్.లక్ష్మణరావు, టిడిపి తరఫున ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీలో ఉన్నారు.

జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా రహదారులపై ప్రమాదాల నివారణ అవగాహనతోనే సాధ్యమని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. హెల్మెట్ ధారణ-ప్రాణానికి రక్షణ, అతివేగం-పొంచి ఉన్న ప్రమాదం అంటూ ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. అయినప్పటికీ జాతీయ, రాష్ట్ర రహదారులపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిజిహెచ్‌కు నెబులైజర్లు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు రెండు నెబులైజర్లు శనివారం అందజేశారు. క్లబ్ సభ్యులు మహమ్మద్ రఫీ తల్లి రంజాన్‌బీ జ్ఞాపకార్థం నెబులైజర్లను అసిస్టెంట్ ఆర్ఎంఒ డాక్టర్ విజయశ్రీకి అందజేశారు. ఈ సందర్భ:గా క్లబ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ కలాం ప్రకాశం సేవా కార్యక్రమాలలో జిల్లాలో ముందు వరుసలో ఉందన్నారు. భవిష్యత్‌లోను మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలాం క్లబ్ ఫౌండర్ లయన్ డాక్టర్ షాకీర్, ఫాస్ట్ వైస్‌ప్రెసిడెంట్ లయన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.